ప్రజాశక్తి

సోమవారం 2 జూన్ 2025

5

అల్లూరి సీతారామరాజు

అరకులోయలో షాపు దగ్ధం

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండల కేంద్రంలోని గ్రీన్ వ్యాలీ జంక్షన్ సమీపంలో బొంగు చికెన్ షాపునకు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి నిప్పంటించారు. దీంతో, షాపు దగ్ధమైంది. షాపులో సామగ్రితో పాటు సరకులన్నీ పూర్తిగా కాలిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు షెడ్డును నిప్పంటించడంతో చాలా నష్టం వాటిల్లిందని బాధితురాలు తెలిపింది. ప్రభుత్వం, అధికారులు స్పందించి తనను ఆదుకోవాలని వేడుకుంది.

చెలరేగుతున్న మంటలు

వర్షాలతో రహదారుల కోత

▸▸ అవస్థలు పడుతున్న వాహనదారులు ▸▸ పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -అనంతగిరి: ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని రోడ్డు భారీ వర్షాల కారణంగా కోతకు గురైంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. మండలంలోని గత వారం రోజులుగా ఏకధాటిగా కుండ పోతవాన కురుస్తున్న నేపథ్యంలో రహదారి పాడవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

మండలానికి మారుమూల కొండ శిఖరు పెద్దకోట పంచాయతీ పరిధి బంగారం మెట్ట మెయిన్ రోడ్డు, సీడివలస గ్రామం నుండి పాటిపల్లి మీదుగా బందకొండ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఈ రోడ్డు పనులు నత్త నడకన నిర్మిస్తున్న తరుణంలో ఈ మధ్యకాలంలో కురుస్తున్న భారీ వర్షం కారణంగా రోడ్డంతా కోతకు గురైంది. బైక్‌లు, అంబులెన్స్ వంటి వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొంది. దీంతో, ఆయా గ్రామాలకు చెందిన గర్భిణీలు, రోగులను అత్యవసర పరిస్థితుల్లో తరలించలేని దుస్థితి ఏర్పడుతుంది.ఆ దారి మార్గాన ఖాళీ నడకన సాగించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఆయా గ్రామాల్లో కూడా రహదారులు దెబ్బతినడంతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. పలు గ్రామాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బందకొండ వద్ద కోతకు గురైన రహదారి

పరిహారంపై ఏదీ భరోసా ?

ప్రజాశక్తి - విఆర్‌పురం: పోలవరం బాధితులకు పరిహారం విషయంలో అధికారులు భరోసా ఇవ్వడం లేదని సర్పంచ్ పిట్ట రామారావు, పీసా కమిటి ఉపాధ్యక్షుడు కోటం జయరాజు ఆరోపించారు. మండలంలో చిన్న మట్టపల్లి పంచాయతీ చింతరేగుపల్లిలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోతున్న బాధితులను రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు ప్రభుత్వం నుండి ఇంటి స్థలాలు, ల్యాండ్ టు ల్యాండ్ చూపిస్తున్నారు కానీ చూసిన తరువాత మళ్లీ అధికారుల నుండి ఎలాంటి సమాచారం రావడం లేదన్నారు. దీనికి సంబంధించి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో సోడి రామారావు, పాయం సత్యనారాయణ టింకు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ రామారావు

నగదు అందిస్తున్న జమాల్‌ఖాన్

ముస్లిం యువతి వివాహానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎటపాక : భద్రాచలం జగదీష్‌కాలనీకి చెందిన మొహమ్మద్ జలాలుద్దీన్ కుమార్తె సోఫియా వివాహ నిమిత్తం ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్‌ను సంప్రదించారు. నిఖా (పెళ్లి) ఖర్చులకు ట్రస్ట్ ద్వారా జమాల్‌ఖాన్ జలాలుద్దీన్ రూ.25 వేలు నగదు ఆదివారం అందజేశారు. కుద్దూస్ మసీద్ ఈద్గా వద్ద ఈ నెల 15వ తేదీన వివాహం జరిపించనున్నారు. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ మాట్లాడుతూ ఒక పేద ముస్లిం యువతి వివాహం కోసం ఎవరైనా తన వంతు సహాయం చేసినట్లయితే వారికి అల్లాహ్ హజ్ చేసి వచ్చినంత పుణ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎండి జావేద్, యాకుబ్ పాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మరియదాసు తదితరులు

చతికిలబడ్డ సూపర్ సిక్స్ పథకాలు

ప్రజాశక్తి - కూనవరం: కూటమి పాలనలో సూపర్‌సిక్స్ పథకాలు చతికిల పడ్డాయని ఎక్కడా అమలకు నోచుకోలేదని జెడ్‌పిటిసి గుజ్జా విజయ వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల మరియదాసు ఆరోపించారు. ఆదివారం వైసిసి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జెడ్‌పిటిసి విజయ మరియదాసు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని ఏ ఒక్కటీ అమలకు నోచుకోలేదని విమర్శించారు. రేషన్‌పంపిణీ పథకాన్ని నిర్వీర్యం చేశారని వాహనదారులను రోడ్డున పడేశారన్నారు. వాలంటీర్లకు రూ.10,000 వేతనం ఇస్తామని చెప్పి వారిని రోడ్డున పడేసిన ఘనత బాబుకే దక్కిందన్నారు. వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 4వ తేదీన వెన్నుపోటుదినం కార్యక్రమం జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, దీకొండ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోఈ ఏడాది అడ్మిషన్లు నేటి నుంచి జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపల్ వి.శంకరరావు వెల్లడించారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్థానిక కళాశాలలో సిఇసి హెచ్ఇసి గ్రూపులు అందుబాటులో ఉన్నాయని పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అడ్మిషన్ పొందడానికి కళాశాలలో దరఖాస్తులు పొందవచ్చున్నారు. ప్రథమ సంవత్సరంలో జాయిన్ అయిన విద్యార్థులకు రూ.1,450లు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సిబ్బందిని సంప్రదించాలని ప్రిన్సిపల్ శంకరరావు తెలిపారు.

నీటి ప్రవాహంలో చిక్కుకున్న యువకులు

ప్రజాశక్తి - మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెంలో ఆదివారం హైదరాబాద్, సామర్లకోట ప్రాంతాలకు చెందిన ఆరుగురు యువకులు సీలేరు నదిలో దిగి స్నానాలు చేస్తుండగా, ఒకేసారి నీటి ప్రవాహం ఎక్కువ అవడంతో సీలేరు వాగులో మధ్యలో ఉన్న రాళ్లకు పట్టుకుని ప్రాణాలు నిలుపుకున్నారు. మోతుగూడెం పోలీసులు, స్థానికులు గ్రామానికి చెందిన ఈతగాళ్ల సహాయంతో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ టూరిస్టులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీలేరు వాగులో దిగకూడదని తెలిపారు.

ప్యాకేజీ కోసం తప్పుడు ధ్రువపత్రాలు

ప్రజాశక్తి - విఆర్.పురం: పోలవరం ముంపు బాధితులకు ఇచ్చే పరిహారం కోసం కొంతమంది గిరిజనేతరులు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టిస్తున్నారని ఆదివాసి సంక్షేమ పరిషత్ సంఘ నాయకులు పాయం లక్ష్మణరావు, పోడియం రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఎప్పుడైతే పునాదులు పడ్డాయో అప్పటినుంచి ఈ ప్రాంతంలో ఆంధ్ర తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చిన కొంతమంది ఆధార్‌కార్డు, రేషన్ కార్డ్, ఇంటి పన్ను పత్రాలను దొడ్డిదారిన అధికారులకు ముడుపులు చెల్లించి పొందారు. దీనివల్ల వాస్తవ లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని వారు వాపోయారు. తప్పుడు పత్రాలు ఇచ్చిన వారిపై విచారణ జరిపి కఠినచర్యలు తీసుకోవాలని గిరిజన, గిరిజనేతరులకు ప్యాకేజీ ఇచ్చే సమయానికి18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇంటి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

యాంటీలార్వా మందు పిచికారి చేస్తున్న సిబ్బంది

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: ప్రజలంతా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరరావు అన్నారు. ఆదివారం సింగంపల్లిలో యాంటీ మలేరియా మంత్ కార్యక్రమాన్ని సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి, ఎంపిడిఒ యాదగిరేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫ్రైడే పాటించాలని, దోమతెరలు కట్టుకుని మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందాలని, దోమల నివారణ కోసం యాంటీలార్వా మందు పిచికారి, ఫాగింగ్ నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి బాలురెడ్డి, వైద్యసిబ్బంది కమల, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు దోమతెరల పంపిణీకి ఏర్పాట్లు

▸▸ ఏసిఎం స్ప్రేయింగ్ తొలి రౌండు 70 శాతం పూర్తి ▸▸ 9 చోట్ల డ్రోన్‌లతో యాంటీ లార్వా ఆపరేషన్‌కు చర్యలు ▸▸ ప్రజాశక్తితో జిల్లా మలేరియా అధికారి తులసి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో మలేరియా నియంత్రణ చర్యల్లో భాగంగా ఈ ఏడాది అన్ని మండలాల్లో దోమతెరలు పంపిణీకి, దోమల నివారణ మందు ఏసీఎం 5 శాతం పిచికారి, యాంటీ లార్వాల్ ఆపరేషన్ల నిర్వహణకు చర్యలు చేపట్టామని జిల్లా మలేరియా అధికారి ఎం తులసి వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మలేరియా జ్వరాలను అదుపు చేసేందుకు చేపడుతున్న కార్యక్రమాలపై 'ప్రజాశక్తి"కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన సమాచారం ఆమె మాటల్లోనే....

మలేరియా నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు?

ఏజెన్సీలో మలేరియా జ్వరాలు ప్రబలకుండా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తుగా ఏసిఎం ఐదు శాతం మందును రెండు విడతలుగా పిచికారి చేసేందుకు ఏర్పాట్లు చేసాం. మలేరియా ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్న 2086 హై రిస్క్ గ్రామాలను గుర్తించి ఏప్రిల్ 15 నుంచి తొలి రౌండు స్ప్రేయింగ్ ప్రారంభించాం.

జిల్లాలో స్ప్రేయింగ్ పనులు వివరాలు:

జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు, ఐటిడిఏల పరిధిలో స్ప్రేయింగ్ పనులు 70 శాతం (1527 గ్రామాల్లో) పూర్తయ్యాయి. జూన్ 15 నాటికి తొలి రౌండు స్ప్రేయింగ్ పూర్తవుతుంది. జూలై 1 నుంచి రెండో విడత స్ప్రేయింగ్ ప్రారంభిస్తాం. దోమలు ఎక్కువ వ్యాప్తి చెందే అవకాశం ఉన్న పెద్ద చెరువులు, నీటి వసతుల్లో డ్రోన్ ద్వారా యాంటీ లార్వాల్ ఆపరేషన్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ డ్రోన్ ఆపరేషన్లు చేసేందుకు జిల్లాలో తొమ్మిది ప్రాంతాలను గుర్తించాం.

దోమతెరలు పంపిణీ చేస్తున్నారా?

మలేరియా బారిన పడకుండా రక్షణ కల్పించేందుకు జిల్లాలో ప్రతి కుటుంబానికి దోమతెరలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాం. జిల్లాలో మొత్తం 10 లక్షల 28 వేల జనాభా ఉన్నారు. అవసరం మేరకు ఐదు లక్షల 80 వేల దోమతెరలు పంపిణీ కోసం ప్రతిపాదన చేసాం.

దోమతెరల రకాలు :

మూడు రకాల సైజుల్లో దోమతెరలు పంపిణీ చేయనున్నాం. ఫ్యామిలీ సైజు డబల్ సైజు సింగిల్ సైజు దోమతెరలను కుటుంబ సభ్యుల సంఖ్య వారిగా సరఫరా చేయనున్నాం. జిల్లాలో గతసారి 2020-21 సంవత్సరంలో మూడు లక్షల 80 వేల దోమతెరలు పంపిణీ జరిగింది. ఈసారి ఐదు శాతం అదనంగా దోమతెరలు పంపిణీకి ప్రతిపాదన చేశాం. త్వరలోనే జిల్లాకు సరఫరా జరగనుంది.

మలేరియా మందుల కొరత ఉందా?

ప్రస్తుతం మందులకు కొరతేమీ లేదు, సమృద్ధిగా ఉన్నాయి. ప్రతి నెలా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నిల్వలు సరిచూసుకొని సరిపడా మందులు సరఫరా చేస్తున్నాం. మలేరియా రక్త పరీక్షల కోసం ఆర్డిటి కిట్లు తో పాటు రోగులకు చికిత్సలందించేందుకు పారాసెట్మాల్, క్లోరోక్విన్, ఏసీటీ మందులు సరఫరా చేస్తున్నాం. దోమల నివారణకు నిర్వహించే స్ప్రేయింగ్, ఏంటీ లార్వాల్ ఆపరేషన్ల కోసం ఏసీఎం 5శాతం మందు సరఫరా చేసాం.

మలేరియా రాకుండా తీసుకోవాల్సిన చర్యలు

ఏజెన్సీలో నివసించే ప్రతి కుటుంబం మలేరియా జ్వరాల పట్ల అప్రమత్తమవ్వాలి. జ్వరం వస్తే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలి.. మలేరియా నిర్ధారణ చేసుకొని చికిత్స పొందాలి.ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా దోమలు పెరగకుండా ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.. ఇంటి లోపల గదుల్లో కూడా స్ప్రేయింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలి. చాలాచోట్ల ఇళ్లలో స్ప్రేయింగ్ చేయించుకోవడానికి ఒప్పుకోని పరిస్థితి ఉంది. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

భిక్షాటన చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు, నిరుద్యోగులు

స్పెషల్ డిఎస్‌సి కోసం భిక్షాటన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ పిలుపు మేరకు అరకులోయ మండలం బస్కి పంచాయతీ కంజరితోట గ్రామంలో ఆదివారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మెగా డీఎస్సీ పోస్టులను గిరిజన ప్రాంతంలో మినహాయించి గిరిజన స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నాయకుడిగా అరకు ప్రచార సభలో జివో నెం 3 స్థానంలో ప్రత్యేక జీవో తెచ్చి మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో నిరుద్యోగ సమస్య పెరుగుతుండటంతో యువత చెడు మార్గంలో పయనిస్తూ గంజాయి వంటి డ్రగ్స్ వంటి చెడు దారులకు వెళ్ళి తమ విలువైన జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గిరిజన ప్రాంతంలో వంద శాతం ఉద్యోగ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోతే మరింత నిరుద్యోగ సమస్య పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ ఉపాధ్యాయ, ఇతర ఉపాధి కల్పన విషయంలో గిరిజనులకే కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్కి పంచాయతీ గిరిజన సంఘం నాయకులు కె దేవన్న,కె సుబ్బారావు, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు వేలాడుతున్న బ్రహ్మకమలం

విరబూసిన బ్రహ్మ కమలం

ప్రజాశక్తి - చింతపల్లి : మండల కేంద్రంలోని కొమ్మర్తి రాంబాబు గృహంలో బ్రహ్మ కమలం విరగబూసింది. సాధారణంగా ఒకటి, రెండు పూలతో బ్రహ్మ కమలం పుష్పాలు దర్శనం ఇచ్చేవి. అటువంటిది శని ఆదివారాలలో కోమర్తి రాంబాబు గృహం వద్ద ఏకంగా 30 నుంచి 40 బ్రహ్మ కమలాలు విరగబూయడం చూపరులను ఆకట్టుకుంటుంది.

సూపర్ మార్కెట్లుగా రేషన్ దుకాణాలు

- **జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**
- **డిపోల్లో రేషన్ పంపిణీ పునఃప్రారంభం**

చట్టి గ్రామంలో రేషన్ పంపిణీ ప్రారంభిస్తున్న ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్

దుంబ్రిగుడలో రేషన్ పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: రేషన్ షాపులను త్వరలో సూపర్ మార్కెట్ల స్థాయికి తీసుకువెళ్లే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. జిల్లాలోని పాడేరు మండలం కిండంగిలో ఆదివారం రేషన్ షాపులను కలెక్టర్ పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భవిష్యత్తులో బియ్యం ఒక్కటే కాకుండా రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటి చిరు ధాన్యాలు కూడా అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 671 రేషన్ షాపుల ద్వారా 2,92,617 కుటుంబాలకు రేషన్ అందించడం జరుగుతుందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసమే రేషన్ షాపుల ద్వారా సరకుల పంపిణీ చేస్తున్నామన్నారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటికే సరుకుల పంపిణీ చేస్తారన్నారు. రేషన్ దుకాణాల్లో ధరల బోర్డులు, స్టాక్ బోర్డులు, పోస్టర్ల ప్రదర్శన సరైన విధంగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.సంయుక్త కలెక్టర్ అభిషేక్‌గౌడ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 66 వేల అంత్యోదయ కార్డులతో పాటు 2,92,617 కార్డుదారులు ఉన్నారని తెలిపారు. ఈ నెలలో జిల్లాకు 5500 టన్నులు బియ్యం, 172 టన్నుల పంచదార విడుదలయ్యిందని తెలిపారు. మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గణేష్ కుమార్, ఎంపీపీ రత్నకుమారి, సర్పంచ్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలో గలగండ పంచాయతీ కేంద్రంలో స్థానిక తహసీల్దార్ రంగారావు రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభించారు. సీతగుంట పంచాయతీ డిపో 90లో సర్పంచి మాధవరావు, రుదకోటలో విఆర్ఓ సత్యారావు అందజేశారు.

హుకుంపేట: రేషన్‌డిపోల ద్వారానే ఇకపై ప్రజలకు నిత్యావసర సరుకులు అందించనున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ కె.కృష్ణారావు తెలిపారు. స్థానిక రేషన్ డిపో వద్ద సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బొంజు బాబు, ఎంపిటిసి రమ, మహిళా అధ్యక్షురాలు సూర్యకాంతం, గోవిందు, నాయకులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండల కేంద్రం, పోతంగి డిపోల్లో టిడిపి మండల మాజీ అధ్యక్షులు టి సుబ్బారావు, మండల నాయకులు స్వామి రేషన్ పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు అందించారు. జిసిసి స్టోర్ వద్ద ప్రజాప్రతినిధులు, రేషన్‌డీలర్, విఆర్ఓ ఆధ్వర్యంలో రేషన్ పంపిణి నిర్వహించారు.

విఆర్.పురం : విఆర్‌పురంలో సర్పంచ్ నరస రేషన్ పంపిణి ప్రారం భించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసమ్మ విఆర్ఓ గంగాభవాని, ఐటిడిపి కన్వీనర్ సిద్ధు, శేఖర్, సూరి, ఆది, జనసేన నాయకులు అంజనరావు, సిపిఐ నాయకులు కర్నాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : ఏజెన్సీలో ఈ నెల నుండి జిసిసి డిఆర్ డిపోల ద్వారా రేషన్ సరఫరా చేస్తామని చింతూరు సబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్ పేర్కొన్నారు. చట్టి గ్రామం జిసిసి డిఆర్ డిపో రేషన్ పంపిణీ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలో జిసిసి డిఆర్‌డిపోల ద్వారా ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉచిత రేషన్‌బియ్యం పంపిణి చేస్తారన్నారు. కార్యక్రమంలో చట్టి సర్పంచ్ భద్రమ్మ, జిసిసి మేనేజర్ సుబ్రహ్మణ్యం, చింతూరు తహశీల్దార్ యస్.చిరంజీవి, సేల్స్‌మెన్ మధుబాబు, విఆర్ఓ సుజాత పాల్గొన్నారు.

సీలేరు: పాడేరు నియోజకవర్గం జిల్లా ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు జికె విధి మండలం సీలేరు జిసిసి రేషన్ డిపో వద్ద రేషన్ లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు పాడేరు నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షులు చిటికలు రాము, సీనియర్ టిడిపి నాయకులు బొర్రకృష్ణ వెల్లడించారు. సర్పంచ్ పాంగి దుర్జో ఉప సర్పంచ్ వల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

సీలేరులో రేషన్ పంపిణీ ప్రారంభిస్తున్న సర్పంచ్ పాంగి దుర్జో

విఆర్‌పురంలో రేషన్ పంపిణీ ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

మోదకొండమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి- మాడుగుల: మాడుగులలో ఈనెల మూడో తేదీన జరిగే మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవంకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని డిపిఓ ఆర్. శిరీష రాణి అధికారులకు ఆదేశించారు. ఆదివారం మాడుగల వచ్చిన ఆమె గ్రామంలో పారిశుధ్యం, తాగునీటి వంటి విషయాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాతర మహోత్సవం కు వచ్చే భక్తులకు తాగునీటి పూర్తిస్థాయిలో అందించడమే కాకుండా పారిశుద్యం మెరుగనుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో తో పాటు పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ రాజారాం, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ జవ్వాది వరహాలు టిడిపి మండలాధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు, ఆలయ కమిటీ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1995-1996లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంతో పాఠశాల ఆవరణ సందడి వాతావరణం నెలకొంది.

మాడుగుల: మాడుగులలో పూర్వపు విద్యార్థులు ఆదివారం కలిశారు. 1998-2006 మధ్యలో మాడుగుల ఆర్.సి.యం పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులు కలుసుకోవడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. ఏడాదికి ఒకసారి ఎలా కలుసుకోవడం ఎంతో శుభ పరిణామన్నారు. పలు ఆటలను నిర్వహించి ఎంతో ఉల్లాసంగా రోజంతా గడిపారు.

ఎర్రమనాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేటలో కామ్రేడ్ లగుడు ఎర్రమనాయుడు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు, కుటుంబ సభ్యులు ఎర్రమనాయుడు స్తూపం వద్ద ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామనాయుడు మాట్లాడుతూ, ఎర్రమనాయుడు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేశారని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లగుడు వెంకటరమణ, నాయకులు మేకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గూడుపమ్మ ఆలయంలో భక్తుల సందడి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని రేబాక గ్రామంలో గూడుపమ్మ తల్లి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వంటలు తీసుకుని భోజనాలు చేశారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో సందడి చేసారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-మధురవాడ : శిల్పారామం జాతరలో వారంతపు సాంస్కృతిక కార్యక్రామాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీ నటరాజ కళాక్షేత్ర చిన్నారులచే నిర్వహించిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. మహాగణపతి, బ్రహ్మమొక్కటే, మూషిక వాహన, రామాయణ శబ్దం, చక్కని తల్లికి చాంగుబల, అదివో అల్లదివో, గోవింద గోవింద, శివతాండవం, భావములోన, గణేష్ స్తుతి, అమ్మ భవాని, ఏకదంతాయ వంటి కీర్తనలకు జయశ్రీ, మౌనిక, మహతి, భావన, హారిక, ఆనయ, కల్పన, కీర్తిక, గ్రీష్మ నృత్య ప్రదర్శన చేశారు.

అప్పన్నను దర్శించుకున్న ముత్యాలరాజు

ప్రజాశక్తి-వేపగుంట : శ్రీ వరలక్ష్మి నృసింహస్వామిని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రేవు ముత్యాలరాజు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ముత్యాలరాజు దంపతులు ముందుగా కప్పస్తంభాన్ని అలింగనం చేసుకున్నారు. తదుపరి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి పటం, ప్రసాదాలను ఇఒ త్రిమూర్తులు అందజేశారు.

నిలిచిన ఏకలవ్య పాఠశాల భవనం పనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన ఏకలవ్య పాఠశాల భవనం నిర్మాణ పనులు సుమారు గత మూడు, నాలుగు నెలల నుంచి నిలిచి పోవడంతో అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో, ఈ ఏడాది విద్యాసంస్థల్లో కూడా ఆ పాఠశాల ప్రారంభం అయ్యే అవకాశం కనబడట్లేదు. దీంతో, పరాయి పంచన అరకులోయలోనే కొనసాగించే పరిస్థితి కనిపిస్తుంది. గతంలో ఈ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన ఉన్నత అధికారులు ఈ ఏడాది విద్యా సంవత్సరంలో నూతన భవనాలను ప్రారంభిస్తామని ప్రకటించారు. పనులు ముందుకు సాగకపోవడంతో ఈ ఏడాది కూడా ప్రారంభమయ్యే అవకాశం లేదు. గత 2019లో ఈ నిర్మాణ పనులను ప్రారంభించగా ఇప్పటివరకు సుమారు ఆరేళ్ల గడుస్తున్నప్పటికీ నిర్మాణ పనులు కాలేదు. ఇదిలా ఉండగా పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చిన భూదాతలకు ఉద్యోగాలు కల్పించకపోవడంతో వారు సుమారు మూడు నెలల క్రితం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఉద్యోగాలు కల్పించిన తరువాతే పాఠశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు భూదాతలకు ఎటువంటి ఉద్యోగాలు కల్పించలేదు. గ్రౌండ్ ఫ్లోర్ వరకు పనులను పూర్తి చేసినప్పటికీ కొన్ని చిన్న చిన్న పనులు ఉండిపోయాయి. ఫస్ట్ ఫ్లోర్ పిల్లర్స్ వేసి వదిలేసారు. పనులు పూర్తి కాకపోవడంతో పాఠశాల ప్రారంభానికి అడ్డంకిగా మారుతుంది. అధికారులు స్పందించి నిర్మాణ పనులను పూర్తి చేసి పాఠశాల భవనాలను ప్రారంభించి, అరకులోయ నుంచి ఇక్కడికి తరలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పనులు మధ్యలో నిలిచిన పాఠశాల భవనం

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: గొట్టువాడ శివారు అనుకు గిరిజన సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు ఎం.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం అణుకు గ్రామాన్ని సందర్శించి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా గ్రామంలో పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించక పోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, గతంలో సిపిఎం నాయకులు చేసిన పోరాటం ఫలితంగా విద్యా వాలంటీర్ నియమించారన్నారు. వాలంటీర్ను తొలగించడంతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. 45 రోజులు నిరాహార దీక్ష ఫలితంగా గ్రామానికి నిర్మించిన గ్రావెల్ రోడ్డు వర్షాలతో పలుచోట్ల కొట్టుకుపోయిందని, దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గ్రామంలో అర్హులను గుర్తించి కాలనీ ఇల్లు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మామిడి నానాజీ, మర్రి సూరిబాబు, రఘు బాబు, సూరిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేతులు జోడించి వేడుకుంటున్న నాయకులు, గిరిజనులు

క్రీడా పరికరాల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ మిని స్టేడియంలో క్రీడాకారులకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. బాక్సింగ్ గ్లౌస్, కరాటే పాడ్స్, టీషర్ట్ లు ఆదివారం నింజాస్ అకాడమీ డైరెక్టర్ వెలగా నారాయణరావు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ గౌతమీ పాల్గొన్నారు. నర్సీపట్నంకు చెందిన క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుతాపల్లి శ్రావణ్, బంగారు నాయుడు ,వెలగ జగన్నాద్ , బాబీ మాస్టారు, బాక్సింగ్ ఆర్మీ కోచ్ యోగా నాయుడు, సీనియర్ కోచ్ శేఖర్ , ఉమెన్ కోచ్ ప్రియాంక, శాప్ కోచ్ అబ్బు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : వైసీపీ టౌన్ ప్రెసిడెంట్, దళిత నాయకుడు అల్లంపల్లి ఈశ్వరరావుపై దాడి కేసులో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని టౌన్ సీఐ గోవిందరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దాడి జరిగిన ఘటనపై ఏరియా ఆసుపత్రిలో ఈశ్వరరావు వద్ద నుంచి వాంగ్మూలం నమోదు చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఈ గొడవలో ఈశ్వరరావు పన్ను విరిగిందని తెలిపారు. అట్రాసిటీ కేసు నమోదు నేపథ్యంలో డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి మండల పరిధి సరిపల్లి నుంచి పిఎస్ఎల్ జంక్షన్‌కు వెళ్లే జాతీయ రహదారి 16లో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. దీనికి సంబంధించి పెందుర్తి పోలీసుల కథనం ప్రకారం... పెందుర్తి ఆదిత్యనగర్‌కు చెందిన శరగడం డాని సత్య అవినాష్ (20), స్నేహితుడు మాడాల శ్రీరామ్ (17)కలిసి సరిపల్లి నుంచి జాతీయరహదారిలో మోటార్ సైకిల్‌పై ఆనందపురం వైపు వెళ్తున్నారు. సరిపల్లి ఫ్లైఓవర్ నుంచి ఆనందపురం వైపు రోడ్డులో ఒక్కసారిగా కుక్క అడ్డురావడంతో దాన్ని ఢీకొట్టి కింద పడిపోయారు. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. డాని సత్య అవినాష్ బిటెక్ రెండో సంవత్సరం, శ్రీరామ్ ఇంటర్మీడియట్ చదువుతున్నారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం పందలపాక గ్రామంలో శనివారం సాయంత్రం సాయి మేఘన (12) విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ఆనందపురం శ్రీ భారతి విద్యానికేతన్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సాయి మేఘన తన ఇంటి వద్ద నీటి మోటారు స్విచ్ ఆన్ చేయడానికి ప్రయత్నించగా వర్షం కారణంగా విద్యుత్ షాక్‌కు గురైకిందపడిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఐటిబిపి అంబులెన్స్ ద్వారా భీమిలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అక్కడ వైద్యులు ఆమెను పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. సాయి మేఘన తండ్రి గండిమాని రంగా ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై విచారణ ప్రారంభించారు. యాత కులస్తులైన గండిమాని రంగా, సుజాత దంపతులకు బాబు వికాస్ (14), పాప సాయి మేఘన (12) ఉన్నారు. కుమార్తె మేఘన ఆటపాటల్లో చలాకి గా ఉండేది. పాప విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. రంగా క్రేన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ముఖ్య కార్యకర్తగా ఉండటంతో స్థానిక పార్టీ కార్యకర్తలు, నాయకులు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని జీనబాడు రహదారిపై ఆదివారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, కివర్ల గ్రామానికి చెందిన కేత దేముడు దేవరాపల్లి నుంచి కివర్ల వైపు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా, అదే సమయంలో పెదబయలు నుంచి దేవరాపల్లి దిశగా వస్తున్న ఎస్. ప్రసాద్ బైక్ ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై ఉన్న వ్యక్తులకు తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను దేవరాపల్లి పిహెచ్‌సికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. వారి ఆరోగ్యం విషమంగా ఉండడంతో 108వాహనంలో కె.కోటపాడు సిహెచ్‌సికి తరలించారు.

ప్రమాదకరంగా పైప్‌లైన్ గోతులు

ప్రజాశక్తి - చింతూరు : మండలంలోని గూడూరు పంచాయతీలో పైపులైన్ కోసం తవ్విన గోతులు పశువులకు ప్రమాదకరంగా మారాయి. తాగునీటికి పైపులైన్లు వేసేందుకు తవ్విన గోతులను వెంటనే పూడ్చలేదు. దీంతో పశువులు పొరపాటున అందులో పడిపోతున్నాయి. ఎవరైనా పిల్లలు కూడా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని వెంటనే గోతులు పూడ్చాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ బుచ్చిబాబు స్పందిస్తూ మెటీరియల్ లేక ఆలస్యమైందని వెయ్యిమీటర్ల పైప్‌లైన్ కాబట్టి కొంత సమయం పడుతోందని రెండు రోజుల్లో గోతులు పూడ్చివేస్తామని ఆయన తెలిపారు.

గోతిలో పడిన దూడ

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఐవి

అధికారులు స్పందించకుంటే పోరాటం తీవ్రం

ప్రజాశక్తి- ఎటపాక : గుండాల రోడ్ల కోసం నాలుగో రోజు రిలే నిరాహార దీక్ష చేస్తున్న నాయకులకు మద్దతు తెలిపి ఐద్వా జిల్లా కమిటి సభ్యులు సోయం వీరమ్మ ప్రారంభించారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటి సభ్యులు ఐ.వి. మాట్లాడుతూ గుండాల పంచాయతీ పరిధిలో రోడ్ల సమస్య గురించి నాలుగు రోజులుగా రిలే నిరాహారదీక్ష చేస్తున్నామన్నారు. అధికారులు త్వరగా స్పందించి రోడ్ల నిర్మాణం ప్రారంభించాలన్నారు. రోడ్లు వేయకపోతే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటి నాయకులు ఇరపా సత్యం, ఐ.పద్మ, జి.హరి, తోట శ్రీను, ఎన్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

15 లీటర్ల సారా స్వాధీనం : ఒకరి అరెస్టు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : వాతంగి పంచాయితీ ఓకుర్తి గ్రామంలో ఆదివారం 30 మంది డ్వాక్రా మహిళలు చొరవచూపి పోలీసులకు అందించిన సమాచారం మేరకు ఒకరిని అరెస్ట్ చేశారు. జడ్డంగి అడిషినల్ ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓకుర్తి గ్రామంలో ముగ్గురు వద్ద సారా ఉందని మహిళలు జడ్డంగి పోలీసులకు సమాచారం ఇచ్చారు. జడ్డంగి అడిషినల్ ఎస్ఐ విజయ్‌కుమార్ ఆదేశాలతో సిబ్బంది గ్రామానికి వెళ్ళి సారా వ్యాపారి మనుగుల అప్పలరాజు నుండి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని జడ్డంగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అప్పలరాజును అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. సారా,గంజాయి, ఆసాంఘిక కార్యక్రమాల పట్ల ఎవ్వరినీ వదిలే ప్రసక్తి లేదని విజయ్‌కుమార్ హెచ్చరించారు. ప్రజలు సహకారం కూడా అవసరమన్నారు.

బస్ పాస్‌ల జారీకి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జూన్‌లో విద్యాసంస్థలు ప్రారంభం కావటంతో విద్యార్థులకు బస్సుపాసుల జారీకి ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ప్రజారవాణాఅధికారి అప్పలనాయుడు మీడియాకు తెలిపారు. నగరంలోని ద్వారకా బస్‌స్టేషను, మద్దిలపాలెం, సింహాచలం, గాజువాక ఎంవిపి బస్ స్టేషను, మధురవాడ, పెందుర్తి, కూర్మన్నపాలెం బస్‌పాసు కౌంటర్లు ఉదయం 8 నుండి రాత్రి 8 వరకూ పనిచేస్తాయన్నారు. విద్యార్థులు online.apsrtcpass.in నందు వారి వివరాలు, ఫొటో నమోదు చేసుకుని, అప్లికేషన్ ఫారం ప్రింట్ తీసుకోవాలన్నారు. ఆ అప్లికేషన్‌పై తమ విద్యాసంస్థ ప్రిన్సిపాల్, హెచ్ఎంచే ధ్రువీకరణ చేయించి, సంబంధిత డిపో కార్యాలయానికి వెళ్లాలన్నారు. ఆ అప్లికేషన్‌కు ఆధార్, పదోతరగతి పాసయిన విద్యార్థులు అయితే టెన్త్ మార్కులిస్టు జెరాక్సు కాపీ జతపరచాలన్నారు. అప్లికేషన్ నందు ఫోన్ నెంబరు తప్పక రాయాలన్నారు. అన్ని విద్యాసంస్థలకు సూచనలు చేస్తూ, అడ్మిషన్ లిస్టు తరగతుల వారీగా ప్రిన్సిపాల్, హెచ్ఎంల సంతకాలతో సంబంధిత డిపో మేనేజరు కార్యాలయానికి అందజేయాలన్నారు. పదో తరగతి వరకు ఉచిత పాస్, స్టూడెంటు జనరల్ పాస్ (ఇయర్లీ), స్టూడెంటు జనరల్ పాస్ (క్వార్టర్లీ), స్టూడెంటు జనరల్ పాస్ (మంత్లీ) ఉండేందుకు అర్హులు అన్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

పౌర ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని పౌరప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. నంబాల కేశవరావు పెద్దకర్మ కార్యక్రమానికి పోలీసులు అవరోధం కల్పించడాన్ని ఖండిస్తూ ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం పౌరప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం పేరుతో కార్పొరేట్ సమయం నడుస్తోందన్నారు. మోడీ, అమిత్‌షా రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాసి చట్టాలను తుంగలో తొక్కి దేశ ప్రజల సంపదను బడాకంపెనీ సంస్థలకు అప్పచెపుతున్నారని ఆరోపించారు. నంబాల కేశవరావు వంటి వారు ఆదివాసి హక్కులను కాపాడడానికి ప్రయత్నం చేశారన్నారు. ఆదివాసీలు తమ భూభాగాలు కాపాడుకోవడానికి ఉద్యమంపై ఆధారపడుతున్నారన్నారు. అటువంటి ఆదివాసీలకు అడ్డుగా మావోయిస్టులు నిలబడ్డారని, రాజ్యాంగ హక్కులను ఉల్లంగించి దాడులు చేశారన్నారు. మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలకు రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై దాడులకు పాల్పడిందని, ఆ సమయంలోనే నంబాల కేశవరావు వంటి వారిని కాల్చిచంపడం జరిగిందన్నారు. కుటుంబ సభ్యులు పెద్దకర్మ చేయడానికి పూనుకుంటే రాష్ట్రప్రభుత్వం ఆంక్షలు విధించటం దుర్మార్గం అన్నారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపి అక్కడ ప్రజలకు రాజ్యాంగ హక్కులు అందేలా చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ నేడు నంబాల కేశవరావు కుటుంబ సభ్యులు కోర్టుకు వెళ్లి మతదేహాన్ని తమకు అప్పగించాలని, న్యాయపోరాటం చేశారన్నారు. పోలీసు దళాలు వారిని హతమార్చిన తర్వాత గౌరవప్రదంగా వారికి అంత్యక్రియలు నిర్వహించుకునే హక్కు రక్తబంధువులకు ఇవ్వకపోవడం శోచనీయం అన్నారు. రక్తసంబంధీకులు రాలేదని ప్రభుత్వమే అన్యాయంగా అంత్యక్రియలు చేసిన పరిస్థితి చూసామన్నారు. కార్యక్రమంలో హౌరా ప్రజాసంఘాలు వేదిక కన్వీనర్ పి.చంద్రశేఖర్, పిఒడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, పడాల గోవింద్, ఈసర లక్ష్మి పాల్గొన్నారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పౌరప్రజాసంఘాల నాయకులు

పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుదాం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మన పర్యాటక ప్రాంతాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకుందాం అని కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ముకుందరావు పిలుపునిచ్చారు. ఆదివారం విశాఖపట్నం కైలాసగిరిపై విఎంఆర్‌డిఎ, సిఫా ట్రస్ట్, ఎస్ఆర్‌యు, జివిఎంసి, గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ క్లైమేట్‌టిమ్ ఎన్‌జిఒల నేతత్వంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అని, మన జల వనరులను మనమే పరిరక్షించుకుందాం అని పిలుపునిచ్చారు. సిఫా ట్రస్ట్ సిఇఒ డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. రాష్ట్రంలో పదివేల మంది గ్రీన్ అంబాసిడర్స్‌తో విభిన్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విఎంఆర్డిఎ అధికారిని సుజాత శివాని, కైలాసగిరి హార్టికల్చర్ అధికారి రమేష్, ఎస్ఆర్‌యు జివిఎంసి ప్రాజెక్ట్ ఇంజనీర్ దాట్ల వివేక్‌వర్మ, గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, గ్రీన్‌వాలంటీర్ కృష్ణకుమారి, ఎస్ఆర్‌యు జివిఎంసి ప్రతినిధి మంగరాజు, గ్రీన్ అంబాసిడర్స్ సంస్థ ప్రతినిధులు పుష్ప, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కైలాసగిరిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నేడు డిసిసిబి చైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఉడా లే అవుట్, మర్రిపాలెంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో కార్యక్రమం జరుగుతుందని ప్రకటనలో తెలిపారు.

బిఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్స్ లేక అవస్థలు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం దారకొండ పంచాయతీ ధర్మపురంలో బిఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ కొన్నాళ్లుగా పనిచేయకపోవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరి క్షేమ సమాచారాలు తెలియడం లేదని, ఏదైనా అత్యవసరమైనా ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం పాలైతే అంబులెన్స్‌కి ఫోన్ చేయడానికి కూడా అవకాశం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే బిఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి అందుబాటులో వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు.

కుటుంబ సభ్యుల చెంతకు మానసిక వికలాంగుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉపాధి కోసం విశాఖ వచ్చి,కేటరింగ్ పనులు చేరి, మానసిక స్థితి బాగోలేక తప్పిపోయి రోడ్లపై తిరుగుతున్న కొర్రా కొండబాబు (47) అనే వ్యక్తిని ఎయుటిడి సిబ్బంది పట్టుకుని జివిఎంసి టిఎస్ఆర్ షెల్టర్‌కు తరలించి చికిత్స అందించారని ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు మీడియాకు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పి.కోడపల్లి మండలం ఊరుగొండ గ్రామానికి చెదిన కొండబాబు శ్రద్ధ ఫౌండేషన్ దగ్గర మూడు నెలలు మందులు వాడడంతో తన ఆరోగ్యం కుదుటపడిందన్నారు. ఈలోగా తన కుమారుడు ఏమైపోయాడో తెలియక బెంగతో తల్లి మృతి చెందిందన్నారు. చనిపోయాడనుకున్న అన్న బ్రతికి ఉన్నాడన్న సమాచారం తెలుసుకుని తమ్ముడు కొర్ర మల్లేశ్వరరావు షెల్టరుకు రావడంతో, కొండబాబును ఆయనకు క్షేమంగా అప్పగించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

క్రీడలతో క్రమశిక్షణ

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: క్రీడలతో వ్యక్తిలో క్రమశిక్షణ అలవడుతుందని తద్వారా వారు సమాజానికి అత్యుత్తమ మానవ వనరులుగా నిలుస్తారని పలువురు శాసనసభ్యులు అన్నారు. మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీగా ఎంపికైన డాక్టర్ భగీరథకుమార్, ఐసిఎఐ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన డి.ప్రసన్నకుమార్ సత్కార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు గణబాబు మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామన్నారు. నగరానికి చెందిన భగీరథకుమార్, ప్రసన్నకుమార్ జాతీయస్థాయిలో ఉన్నత పదవులను అందుకోవడం నగరానికి గర్వకారణం అన్నారు. విశాఖ నగరానికి, తాము చేపట్టిన పదవులకు మరింత పేరు తెచ్చే విధంగా కృషి చేయాలని పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష అన్నారు. అనంతరం భగీరథకుమార్, ప్రసన్నకుమార్‌లను సత్కరించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ చంద్ర, కార్యదర్శి శీలం లక్ష్మణ్, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, కార్యదర్శి తామస్ అయ్య, కళాభారతి కార్యదర్శి డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

రహదారిని బాగు చేయాలి

ప్రజాశక్తి - సీలేరు : జికె వీధి మండలం ఆర్ వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారి అస్తవ్యస్తంగా ఉందని జికె వీధి మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బత్తుల సిద్ధార్థ మార్కరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్‌వినగర్ నుంచి లంకపాకల వరకూ రహదారి అధ్వానంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణం చేపట్టాలని అనేకసార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పనులు చేపట్టలేదన్నారు. ఇటీవల చింతపల్లి సబ్ డివిజనల్ ఎఎస్‌పి నవజ్యోతి మిశ్రా జికె విధి సిఐ వరప్రసాద్, ఎస్ఐ అప్పలసూరి స్పందించి లంకపాకల వద్ద గోతులు పూడ్చి వేయించారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

మాట్లాడుతున్న విజయనగరం లోక్‌సభ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు

4న జగన్ పాలనా విముక్తి దినం

- విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగన్ పరిపాలన నుండి విముక్తి పొందేందుకు ప్రజలు జూన్ 4న తీర్పు ఇచ్చారని విజయనగరం లోక్‌సభ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం జిల్లా టిడిపి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాలన అద్భుతంగా సాగుతోందన్నారు. జూన్4 వెన్నుపోటు దినంగా ప్రకటించడం హేయమైన చర్య అని ప్రజాతీర్పు అంటే గౌరవం లేదా అని వైసిపి నాయకులను ప్రశ్నించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును వెన్నుపోటు దినంగా ప్రకటించడంలోనే మీ వ్యక్తిత్వం తెలుస్తోందని ఎద్దేవా చేశారు. మహానాడు జరపకూడదని కలెక్టర్‌కు జగన్ రిప్రజెంటేటివ్ ఇచ్చారని వారి పార్టీ కార్యక్రమాలను మేము ఎప్పుడైనా అడ్డుకున్నామా అని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు తమ్మినేని మోహన్ పాల్గొన్నారు.